# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 13-06-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు బాధ్యతలు స్వీకరించారు.
- యువత తమ నైపుణ్యాలను మెరుగుపరచుకుని రాణించాలని పూర్వ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు అన్నారు.
- పేదరికం లేని సమాజం కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.
- సాంకేతిక వినియోగంతో పౌర విమానయానాన్ని మరింత ముందుకు తీసుకెళ్తామని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు.
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముఖ్య కార్యదర్శిగా యం.రవిచంద్ర ఈ రోజు బాధ్యతలు చేపట్టారు.

==========================

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు బాధ్యతలు స్వీకరించారు. వెలగపూడి సచివాలయం మొదటి బ్లాక్‌లోని తన ఛాంబర్‌లో వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించి బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు 16 వేల 347 ఉపాధ్యాయుల పోస్టుల భర్తీకి సంబంధించి మెగా డీఎస్సీ దస్త్రంపై మొదటి సంతకం చేశారు. అలాగే ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు ఫైల్‌పై రెండో సంతకం, సామాజిక పింఛన్లు 4 వేల రూపాయలకు పెంచుతూ మూడో సంతకం, అన్నా క్యాంటీన్ల పునరుద్ధరణ, నైపుణ్య గణన ఫైళ్లపై సంతకాలు చేశారు. ముఖ్యమంత్రి హోదాలో సచివాలయానికి వచ్చిన చంద్రబాబు నాయుడుకు వివిధ శాఖల ఉన్నతాధికారులు, ఉద్యోగ సంఘాల నేతలు ఘన స్వాగతం పలికారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరభ్ కుమార్ ప్రసాద్, మంత్రులు అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, నిమ్మల రామానాయుడు, పయ్యావుల కేశవ్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

==========================

యువత తమ నైపుణ్యాలను మెరుగుపరచుకుని రాణించాలని తద్వారా దేశం అభివృద్ధి పథంలో పయనిస్తుందని పూర్వ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు అన్నారు. కృష్ణా జిల్లా ఆత్కూర్ లోని స్వర్ణభారత్ ట్రస్ట్ లో శిక్షణ పొందుతున్న యువతీయువకులతో ఆయన ఈరోజు ముఖాముఖి నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యువతకు

క్రమశిక్షణ, సమయపాలన, నిజాయతీ ఎంతో అవసరమని అన్నారు. గ్రామీణ నిరుద్యోగ యువత, రైతులు, మహిళల ఆర్థిక బలోపేతానికి స్వర్ణభారత్ ట్రస్ట్ కృషి చేస్తోందని పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పేదరికం లేని సమాజం కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. ఈ రోజు కుటుంబ సభ్యులతో కలిసి ఆయన తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ, ఆర్థిక అసమానతలు తగ్గించడం ప్రభుత్వ విధానల వలనే సాధ్యపడుతుందని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పరిపాలన సాగిస్తామన్నారు. అలాగే భారతదేశం ప్రపంచంలో మొదటి స్థానంలో నిలవాలని శ్రీవారిని ప్రార్థించినట్లు తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా శ్రీవేంకటేశ్వర స్వామి వారి దేవాలయాల నిర్మాణాలు చేపడతామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. అలాగే విజయవాడ శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామి వార్లను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దర్శించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి కె.ఎస్.రామారావు ఆలయ మర్యాదలతో ముఖ్యమంత్రికి స్వాగతం పలికారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

సాంకేతిక వినియోగంతో పౌర విమానయానాన్ని మరింత ముందుకు తీసుకెళ్తామని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. ఢిల్లీలోని రాజీవ్ గాంధీ భవన్ లో పౌర విమానయాన శాఖ మంత్రిగా ఆయన బాధ్యతలు చేపట్టారు. అనంతరం మాట్లాడుతూ, తనకు అప్పగించిన మంత్రిత్వ శాఖకు సంపూర్ణ న్యాయం చేస్తానని, అలాగే 100 రోజుల యాక్షన్ ప్లాన్ అమలు చేయనున్నట్లు తెలియజేశారు. సామాన్యుడికి ఈజ్ ఆఫ్ ఫ్లయింగ్ తీసుకువస్తామని, అదేవిధంగా ప్రయాణికులకు భద్రత, సౌకర్యాలు కల్పిస్తామని అన్నారు. పర్యావరణ హితంగా ఎయిర్ పోర్టులను తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడతామని ఆయన స్పష్టం చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముఖ్య కార్యదర్శిగా యం.రవిచంద్ర ఈ రోజు సచివాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా వేదపండితులు ఆయనకు దివ్య ఆశీస్సులు అందించారు. అనంతరం పలువురు అధికారులు, సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. తదుపరి ఆయన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ ను మర్యాద పూర్వకంగా కలిశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశంలోని అన్ని ప్రదేశాల్లో కావాల్సినంత విద్యుత్తు అందుబాటులో ఉందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జీ. కిషన్ రెడ్డి అన్నారు. ఈరోజు ఢిల్లీలో ఆయన కేంద్ర మంత్రిగా బాధ్యలు స్వీకరించిన అనంతరం విలేకరులతో మాట్లాడుతూ... గతంలో బొగ్గు కొరత వల్ల, అవసరానికి తగినట్లు విద్యుత్తు అందుబాటులో లేదని, రాబోయే అయిదేళ్లలో సంకల్ప యాత్రలో భాగంగా చేసిన వాగ్దానాలను పూర్తి చేయనున్నట్లు తెలిపారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖల సహాయమంత్రిగా గుంటూరు లోక్ సభ సభ్యులు పెమ్మసాని చంద్రశేఖర్ ఈరోజు బాధ్యతలు స్వీకరించారు. ఢిల్లీలోని తన కార్యాలయంలో ఈ సందర్భంగా మాట్లాడుతూ... తనకు కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వహిస్తానని అన్నారు. ‘‘ఈ బాధ్యలతను అప్పగించిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడులకు ధన్యవాదాలు తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశవ్యాప్తంగా జులై 1వ తేదీ నుంచి అమలులోకి రానున్న మూడు నూతన నేర న్యాయ చట్టాలైన “భారతీయ న్యాయ సంహిత”, “భారతీయ నాగరిక్ సురక్ష సంహిత”, “భారతీయ సాక్ష్య అధినియం” చట్టాలపై సర్వత్రా ప్రశంసలు వస్తున్నాయి. ఈ సందర్భంగా అనంతపురంలోని న్యాయ శాస్త్ర విద్యార్థిని మహిమ ఆకాశవాణితో మాట్లాడుతూ... ఈ నూతన చట్టాల అమలు ద్వారా నేరస్తులకు సరైన సమయంలో శిక్ష పడుతుందన్నారు. మహిళల భద్రతకు ఈ చట్టాలు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొంటూ....

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

నైరుతి రుతుపవనాలు మరో నాలుగు రోజుల్లో మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, కోస్తా ఆంధ్ర ప్రదేశ్ లోని వాయువ్య బంగాళాఖాతంలోని మరికొన్ని ప్రాంతాల్లోకి మరింత ముందుకు వెళ్లేందుకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో ఉత్తర కోస్తాంధ్ర, యానాంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు ఒకటి లేక రెండు చోట్ల కురిసే అవకాశముందనీ తెలిపింది. అలాగే ఈదురు గాలులు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో వీచే అవకాశం ఉందని వెల్లడించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

సాంఘిక సంక్షేమ వసతి గృహాల విద్యార్థుల బంగారు భవిష్యత్తే లక్ష్యంగా అధికారులు కార్యాచరణ రూపొందించాలని విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ. మల్లికార్జున సూచించారు. ఈ రోజు జిల్లా కలెక్టరేట్ లో సంబంధిత అధికారులతో చేపట్టాల్సిన ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వసతి గృహాలు, క్రీడలకు ప్రాధాన్యతను ఇస్తామని తెలిపారు. “విశాఖ విద్యా వసతి వికాసం” పేరుతో చేపట్టిన పనుల్లో సాధించిన ఫలితాల గురించి కలెక్టర్ వివరించారు. సీఎస్సార్ నిధుల కింద దాతలు అందించిన సాయంతో చాలా పనులు చేశామని, భవిష్యత్తులో మరిన్ని పనులు చేపడతామని ఆయన పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్రంలో ఉన్న ఆర్థిక సంక్షోభాన్ని దృష్టిలో ఉంచుకుని తిరువూరు నియోజకవర్గం శాసనసభ్యులు కొలికపూడి శ్రీనివాస్ ముఖ్యమంత్రి సహాయనిధికి విరాళం ప్రకటించారు. సార్వత్రిక ఎన్నికల్లో ఎన్టీఆర్ జిల్లా తిరువూరు నియోజకవర్గం నుంచి విజయం సాధించిన శ్రీనివాస్ తన ఎమ్మెల్యే జీతంతో పాటు ఇతర అలవెన్స్‌లను ముఖ్యమంత్రి సహాయ నిధికి విరాళంగా అందజేస్తున్నట్లు ప్రకటించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ ఆదేశాల మేరకు శ్రీకాకుళం జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ అధ్యక్షులు జునైద్ అహ్మద్ మౌలానా ఈ రోజు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యాలయంలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి ఒక్కరు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో భాగంగా 200 మంది పాల్గొనగా 104 మందికి వైద్య పరీక్షలు చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

సెప్టెంబరు నెలకు సంబంధించిన తిరుమల శ్రీవారి ఆర్జిత సేవా టికెట్లను ఈనెల 18న ఉదయం 10 గంటలకు ఆన్ లైన్లో విడుదల చేయనున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానం ప్రకటించింది. అలాగే.. ఈ సేవా టికెట్ల ఎలక్ట్రానిక్ డిప్ కోసం జూన్ 18వ తేదీ

ఉదయం 10 నుంచి జూన్ 20వ తేదీ ఉదయం 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని వెల్లడించింది. లక్కీ డిప్‌లో టికెట్లు పొందిన భక్తులకు నగదు చెల్లించిన తరువాత ఆర్జిత సేవల టికెట్లు ఖరారు అవుతాయని పేర్కొంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

గుంటూరు జిల్లాలోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అనుబంధ కళాశాలలకు వేసవి సెలవులను పొడిగిస్తూ వర్సిటీ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. వర్సిటీలోని కళాశాలలు,  బాలబాలికల వసతిగృహాలను సిద్ధం చేసేందుకు మరికొంత సమయం కావలసి ఉండడంతో ఈనెల 18వ తేదీ నుంచి కళాశాలను ప్రారంభించాలని వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య బి.కరణ ఉత్తర్వులు జారీ చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =